# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 19 సెప్టెంబరు , 2026 | పేజీలు : 6





నల్లగొండ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చే బాధ్యతను మంత్రి కోమటిరెడ్డి తీసుకోవాలి

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల పరిస్థితి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మండలంలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో త్రాగు నీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య వైద్యం విద్యుత్ తదితర మౌలిక వసతులపై ప్రత్యేక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి ప్రభుత్వ నిధులు సద్వినియోగం అయ్యేలా పర్యవేక్షణ పెంచాలని పేర్కొన్నారు. రెవిన్యూ శాఖ అధికారులు సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని ఆనాది నుండి సాగు చేసుకుంటున్న రాచకొండ గిరిజనుల పోడు భూముల విషయంలో అటవీ శాఖ అధికారులు రెవెన్యూ శాఖ అధికారులు అన్యాక్రాంతమైన భూములను కాపాడాలని అధికారులను కోరారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో జాప్యం చేయవద్దని నిజమైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు. మన ప్రాంతానికి సాగు త్రాగునీరు కోసం రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని ప్రజా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. మన ప్రాంతంలో ప్రాజెక్టు పనులు నత్తనలకుగా నడుస్తున్నాయని నీటి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. యూరియా రద్దు చేయాలని శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడినందుకు సమీక్ష సర్వ సభ సమావేశంలో మండలంలోని సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ ప్రమీల, ఎంపీడీవో ప్రమోద్ కుమార్, సూపరింటెంట్ సుధాకర్ చారి, గుజ్జ పిఏసిఎస్ చైర్మన్ దొడయాదిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నాగరాజ్, మండల అధికారులు, సర్పంచులు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్‌లు పాల్గొన్నారు.



## ఎడమ కాల్వ నీళ్లు ఖమ్మం జిల్లా వారికేనా...

### సూర్యాపేట, నల్లగొండ రైతులు ఎండిపోతే పర్వాలేదా?

### మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : ఎడమ కాలువ నీళ్లు ఖమ్మం జిల్లా వారికేనా... సూర్యాపేట నల్లగొండ జిల్లాల రైతులు ఎండిన పరవా లేదా... సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టి ఖమ్మం జిల్లాకు నీటిని తరలిస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం మండలంలోని సింగారెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇక్కడి రైతులు ఇప్పటికే పంటలు వేసి నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లాలోని బోనకల్, ముదిగొండ, చింతకాని, మధిర ప్రాంతాలకు సాగర్ ఎడమ కాల్వ నీటిని తరలించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలు ఇచ్చారని, ఆ ఆదేశాలకు జిల్లా మంత్రి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంగీకరించడంతో తూములు మూసివేసే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి నెమ్మాది బిక్షం, పిఏసిఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, మాజీ మండల అధ్యక్షులు దొంగరి యుగేందర్, సూర్యాపేట మాజీ జడ్పిటిసి జీడి బిక్షం, సతీష్ పాల్గొన్నారు.

# ఉద్యోగ మేళాకు పటిష్ఠ భద్రత

### ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పి కె.నర్సింహ్మా



ప్రజాపక్షం/కోదాడ: నేడు పట్టణంలోని సిసిరెడ్డి కాన్వెంట్ విద్యాలయంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఉద్యోగ మేళాకు పోలీస్ శాఖ తరుపున పటిష్ఠమైన భద్రత బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పి కె.నర్సింహా తెలిపారు. శుక్రవారం భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల మార్గాలను, పార్కింగ్ స్థలాలను, ఉద్యోగ మేళా ప్రాంగణాన్ని పరిశీలించారు. పటిష్ట భద్రత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 600 మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తారని, ఉద్యోగ మేళాకు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతి, యువకులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి రక్షణ కల్పించేలా ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బందోబస్తు విధుల్లో సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు చెందిన సుమారు 600 మంది పోలీస్ సిబ్బంది పాల్గొంటారని చెప్పారు. బందోబస్తులో ఒక ఎస్పి, ఒక అదనపు ఎస్పి, ఆరుగురు డిఎస్‌పిలు, 15 మంది సిఐలు, 45 మంది ఎస్‌ఐలు సహా 600 మంది పోలీస్ సిబ్బంది కలిసి విధులు నిర్వహిస్తారని తెలిపారు. పోలీస్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు బందోబస్తు, ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే వారి వాహనాల కోసం 8 ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయడం జరిగింది. అభ్యర్థులు వేచి ఉండటానికి 5 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది.

**వాహనాల మార్గాల్లో మార్పులు**

ఉద్యోగ మేళాకు వచ్చే వాహనాలు ఖమ్మం క్రాస్‌రోడ్డు నుంచి ఉద్యోగ మేళా ప్రాంగణం వైపు రావడానికి అనుమతి లేదు. ఉద్యోగ మేళాకు వచ్చే వారు వారి వాహనాలను జాతీయ రహదారిమీదుగా వచ్చి దుర్గాపురం ఎక్స్ రోడ్డు నుంచి కోదాడ పట్టణంలోకి ప్రవేశించే మార్గాన్ని వినియోగించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఉద్యోగ మేళాకు వచ్చే వాహనాలను సిబ్బంది సూచించే నిర్దేశిత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలుపుకోవాలని, అక్కడి నుంచి ఉద్యోగ మేళా ప్రాం గణానికి చేరుకోవాలని, రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు.

**సాధారణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు**

ఉద్యోగ మేళా కారణంగా కోదాడ పట్టణంలోని సాధారణ పౌరుల దినచర్యకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు ఎస్పి తెలిపారు. పట్టణ ప్రజల తమ సాధారణ కార్యక్రమాలను యధావిధిగా నిర్వహించుకోవచ్చని చెప్పారు.

**సిసి కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ**

ఉద్యోగ మేళా ప్రాంగణంలో భద్రత పర్యవేక్షణకు 30 సిసి కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి నిరంతరం పర్యవేక్షణ చేయడం జరుగుతుందని ఎస్పి తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని, తమ అర్హతలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను వినియోగించుకుని తమ భవిష్యత్‌కు మంచి పునాది వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్‌రెడ్డి, డిఎస్‌పిలు ప్రసన్నకుమార్, శ్రీనివాసరెడ్డి, రవి, స్థానిక సిఐ శివశంకర్, ఎస్‌ఐ లు సిబ్బంది ఉన్నారు.

## బాలికల జూనియర్ కళాశాల సైన్స్ ల్యాబ్‌కు మరమ్మతులు

ప్రజాపక్షం/నల్లగొండటౌన్: రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సైన్స్ ల్యాబ్‌కు అవసరమైన మరమ్మతులు చేపడతామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు.తమ కళాశాలలోని సైన్స్ ల్యాబ్ పాతబడిపోయి పెచ్చులు ఊడిపోతున్నాయని,కొత్త ల్యాబ్ మంజూరు చేయాలని విద్యార్థినులు గురువారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు.ఈ నేపథ్యంలో మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డితో కలిసి శుక్రవారం కళాశాలను సందర్శించి సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు.





## నీలమ్మ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మున్సిపాలిటీలోని 5వ వార్డు నర్సయ్యగూడెం గ్రామానికి చెందిన అలక నీలమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి శుక్రవారం నీలమ్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ నూకల సందీప్‌రెడ్డి, వార్డు సభ్యులు నన్నెపంగు శ్రీనివాస్, కొణతం మంజుల, లావణ్య, యారవ లక్ష్మి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ తాళ్ల సురేష్‌రెడ్డి, కుటుంబ సభ్యులు సైదిరెడ్డి, శ్రవణ్‌రెడ్డి ఉన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన




**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో వైఆర్‌జికెఆర్ లింక్ వర్కర్ పథకం సహకారంతో శుక్రవారం నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్స నిర్వహించారు. ఈసందర్భంగా వైజిఆర్‌కేర్ ప్రతినిధులు ఎస్.నర్సింహాచారి, జిల్లా నిర్వాహకురాలు సుజాత, పర్యావేక్షకురాలు కల్పన పాల్గొని విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాప్తి, నివారణచర్యలు, అపోహలు, నిజాలు, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన పెంచుకుని అపోహలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీరజ, అధ్యాపకులు వెంకటరమణ, ప్రణతి, జాతీయ సేవా పథకం అధికారి వనపర్తి శ్రీనివాసులు, నర్సింహచారి, వెన్నెల, వీరేష్ పాల్గొన్నారు.

## పోషణ మాస వేడుకలు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని న్యూబంజార హిల్స్ తండలో అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ వాంకుడోత్ ఝాన్సీ ఆధ్వర్యంలో జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలో పోషకాహార లోపాన్ని నివారించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సరిత మాట్లాడుతూ సమాజంలో ఆరోగ్యవంతమైన తరాన్ని అందించడానికి గర్భిణీలు, బాలింతలు నిత్యం పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ కవిత రవీందర్, ఉపసర్పంచ్ బానోతు శివ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. రాంరెడ్డి, టీచర్ ఎం. మాధవి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



## మెగా ఉద్యోగ మేళా పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా మునుగోడు నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తంగడపల్లిలో మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఆసరా ఫౌండేషన్ చైర్మన్ బొల్ల శివశంకర్ ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్వహించనున్న మెగా ఉద్యోగ మేళాకు సంబంధించిన పోస్టర్ను సంస్థాన్ నారాయణపురం ఎస్సై సీత పాండు ఆవిష్కరించారు.సెప్టెంబర్ 27న ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తంగడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ మేళా జరగనుంది.ఇందులో 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొని 3,000కి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కంపెనీలు, తయారీ రంగం, బీపీఓ, సమాచార సాంకేతికత, సాఫ్ట్వేర్, ఆరోగ్య సంరక్షణ, బ్యాంకింగ్, రిటైల్, అమ్మకాలు, మార్కెటింగ్ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మునుగోడు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు పొందాలని ఆసరా ఫౌండేషన్ నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో విలేకరి సంగిశెట్టి ధనుంజయ్, సోమన బోయిన కృష్ణ కుమార్ యాదవ్, సింగం కృష్ణ, బంగారు లక్ష్మణ్, సంగిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల, కోతుల బెడద నుండి ప్రజలను కాపాడండి



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని కొత్తగూడెం గ్రామపంచాయతీలో ప్రజలు వీధి కుక్కలు మరియు కోతుల బెడద వలన తీవ్ర ఇబ్బందిగురి అవుతున్నారు. అని గ్రామంలోని యువత ఎంపీడీవో ప్రమోద్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో వీధి కుక్కలు కోతుల వలన గ్రామ ప్రజలు, చిన్నపిల్లలు భయభ్రాంతులకు గురి అవుతున్నారని గతంలో కురుమ గూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తిని కుక్క కరవడం జరిగిందని, దీనిపై స్థానిక పాలకవర్గానికి గతంలో తెలుపగా గ్రామసభ నిర్వహింకి చర్యలు తీసుకోవాలని తీర్మానించిన ఏలాంటి చర్యలు తీసుకోలేదని, కాబట్టి వీది కుక్కలను కోతులను ఊరి నుండి తొలగించే ప్రయత్నం చేయాలని, గ్రామస్తులు స్థానిక ఎంపీడీవోకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు రాచకొండ జంగయ్య, కొత్తగూడెం గ్రామపంచాయతీ రెండవ వార్డ్ సభ్యులు బాలగోని మల్లేష్, నాలుగో వార్డు సభ్యులు రొమ్ముల సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు బాలగోని మల్లేష్, మాజీ వార్డ్ సభ్యులు రాచకొండ లింగస్వామి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రెక్క యాదగిరి పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సూర్యాపేట జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష సూర్యాపేటకు రైలు రావాల్సిందేనని ప్రజల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వాలు పరిష్కరించాలని సూర్యాపేట బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకి రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట బంద్‌లో భాగంగా ఆర్‌టిసి డిపో వద్ద నిర్వహిస్తున్న ధర్నా చేస్తున్న ఉద్యమకారులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి అలైన్మెంట్ ప్రకారంగానే బుల్లెట్ ట్రైన్ రైల్వే కారిడార్‌ను జాతీయ రహదారి 65కు ఆనుకొని రావాలని డిమాండ్ చేశారు. కొంత మంది రాజకీయ నాయకులు కుట్రలు పన్ని సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ రాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కోకన్వీనర్ చలమల్ల నరసింహ, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు ఎంత మంది ఎన్ని శక్తులు అడ్డుపడినా సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించుకుంటామన్నారు. అరెస్టు అయిన వారిలో కమిటి సభ్యులు వెలుగు వనిత, సట్టు నాగయ్య, కందుకూరి యాదగిరి, ఎల్గూరి రామ్మూర్తి గౌడ్, మీనయ్య, శోభ, పద్మ ఉన్నారు.

## మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతి, యువకులు సద్వినియోగం



**ప్రజాపక్షం/నడిగూడెం:** నేడు కోదాడలోని సిసిరెడ్డి కాన్వెంట్ స్కూల్‌లో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ల ఆధ్వర్యంలో నిరుద్యోగులకు నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళా కోసం కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతి, యువకులు కోదాడకు తరలివచ్చి ఈ మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వేపూరి తిరపతమ్మ సుధీర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాగితాలతో పొట్ట చేతబట్టుకుని ఉద్యోగాల కోసం లక్షల రూపాయల అప్పుచేసి కిరాయి ఇళ్లలో, హాస్టల్‌లో ఉంటూ రాత్రి పగలు కష్టపడి చదువుతూ ఒకవైపు ఆకలి చంపుకుని బిస్కెట్ టీలతో ఉద్యోగం కోసం ఎదురుచూడాల్సిన పనిలేకుండా మన రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 300 కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయనాయక్, ఉప సర్పంచ్ ఎలుగూరి నాగరాజు, వార్డు సభ్యులు దున్న శ్రీకాంత్, కాసాని మాదవి, గోపి, అధ్యాపకులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ప్రజా వైద్య శిబిరం

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో మేళ్లచెరువులోని నాయుడు బజార్‌లో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వాతావరణ మార్పుల వల్ల వైరల్ జ్వరాలతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఈ క్యాంపు ఏర్పాటు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, వినోద లు బాధితులకు వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల వ్యాప్తి చెందకుండా ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని, జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా సొంత వైద్యానికి దూరంగా ఉండి వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంథాలయ నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించాలి



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని వెంటనే ప్రారంభించాలని బిఆర్‌ఎస్ నాయకులు రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయం ముందు మాట్లాడారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు ఉండే గదులు మాత్రమే కావని, జ్ఞానానికి నిలయాలుగా యువత భవిష్యత్‌కు బాటలు వేసే కేంద్రాలు అన్నారు. మద్యతరగతి విద్యార్థులకు ఖరీదైన పుస్తకాలు, కోచింగ్ సౌకర్యాలు అందుబాటులో లేకపోయినా గ్రంథాలయాలు వారికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు పుస్తకాలు, పత్రీకలు, ప్రశాంతమైన చదువు వాతావరణం అవసరమన్నారు. అలాంటి జ్ఞాన బండాగారాలు మూసి ఉంటే నష్టపోయేది చదువుకునే యువత అన్నారు. వెంటనే గ్రంథాలయాన్ని ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు తక్కెళ్ల నాగార్జున, షేక్ నాగుల్‌మీరా, పత్తిపాక రమేష్, గౌతమ్, వాస విజయ్, బోస్ పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో గిరిజన జనాభా అధికంగా ఉన్నందున వారి సంక్షేమం, హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ధీరావత్ రవినాయక్ కోరారు. శుక్రవారం దామరచర్ల మండలం రాళ్లవాగు తండాకు చెందిన ధీరావత్ అశోక్‌నాయక్‌ను మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన జాతి అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ నిరంతరం కృషి చేయాలన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు అశోక్ నాయక్ మాట్లాడుతూ ప్రాంతంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడీలకు మంత్రి పదవి కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ధీరావత్ శ్రీను నాయక్, డివిజన్ నాయకులు రాజు నాయక్, సక్రు నాయక్, శంకర్ నాయక్, గిరిజన హక్కుల పోరాట సమితి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## నిరుపయోగంగా జానలదిన్నె సెగ్రిగేషన్ షెడ్డు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మండలంలోని జానలదిన్నె గ్రామ పంచాయతీలో లక్షల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని బిఆర్ఎస్ యూత్ నాయకులు తక్కెళ్ల నాగార్జున అరోపించారు. శుక్రవారం షెడ్డును పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో చెత్తను శాస్త్రీయంగా వేరు చేసి నిర్వాహించాల్సిన ఈ షెడ్ వినియోగంలోకి లేకపోవడంతో చెత్తరోడ్లు వెంబడి పేరుకుపోయి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. నూతనంగా నిర్మించిన షెడ్‌ను ఉపయోగించకుండా వదిలేయడం బాధకరమన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సెగ్రిగేషన్ షెడ్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగుల్‌మీరా, మధు, శ్రీనివాస్, గోపాల్ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలని గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న అన్నారు. శుక్రవారం మండలంలోని రామన్నగూడెం గ్రామంలో వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటి జ్వరం సర్వే నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురుగునీటి నిల్వలను తొలగించి దోమలు వ్యాప్తి చెందకుండా థిమోపాస్ మందును పిచికారి చేయించారు. అలాగే వీధుల్లో, మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ ఫౌడర్ చల్లారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సుధాకర్, ఏఎన్ఎం గిరిజ, ఆశా కార్యకర్త శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడా ప్రతిభను వెలికి తీయాలి: ఎస్ఐ నరేష్

**ప్రజాపక్షం/త్రిపురారం :** విద్యార్థులు తమలోని క్రీడా ప్రతిభను వెలికి తీయాలని త్రిపురారం ఎస్ఐ నరేష్ అన్నారు.మండల కేంద్రంలోని దుబ్బ క్వార్టర్స్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు హనుమాన్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని,విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో లక్ష్యాన్ని ఏర్పరచుకుని దానిని సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు.అనంతరం విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేసేందుకు రూ.5,116 ను పాఠశాలకు విరాళంగా అందజేశారు.కార్యక్రమంలో ఎంఈఓ రవి నాయక్,ఉపాధ్యాయులు వెంకట్రాం,శివశంకర్,రాము, నరసయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## కూరగాయ పంట విరివిగా పండించండి



**ప్రజాపక్షం/నాంపల్లి:** ఎల్‌నినో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు కూరగాయలు విరివిగా పండించాలని జిల్లా ఉద్యాన అధికారి టి. శేఖర్ సూచించారు.మండలంలోని తుంగపాటి గౌరారం గ్రామ రైతు వేదికలో శుక్రవారం ఆత్మ, మునుగోడు డివిజన్ సహకారంతో ఉద్యాన పంటల సాగు,యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కెవికె కంపసాగర్ శాస్త్రవేత్త హిమబిందు మాట్లాడుతూ.. దొండ పందిర్ల సాగులో పండు ఈగ నివారణ,యాజమాన్యం,పంట మార్పిడి, ఎల్‌నినో ప్రభావంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.జిల్లా ఉద్యాన అధికారి శేఖర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు లాభదాయకమని తెలిపారు.మునుగోడు డివిజన్ ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి రావుల విద్యాసాగర్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల్లో కూరగాయలు,పండ్లు,ఆయిల్ పామ్ తోటలను కాపాడుకోవడంపై సూచనలు చేశారు.కార్యక్రమంలో వ్యవసాయ డివిజన్ చైర్మన్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి,ఏడీఏ వేణుగోపాల్, బండారు శివ, సర్పంచులు లక్ష్మి ప్రసన్న కృష్ణారెడ్డి,మనిమాల శ్రీశైలం యాదవ్, లక్ష్మి సైదులు, బి.గిరి,గజ్జల యాదగిరి రెడ్డి,ఏఈఓ మౌనిక,హెచ్ఈఓ హరీష్, ఫీల్డ్ స్టాఫ్ బాన్ చందర్, మోహన్,బాబు,యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



**ప్రజాపక్షం/అనంతగిరి:** ప్రతి ఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఏడుకొండలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సులో మాట్లాడారు. గ్రామంలో ఉన్న నిరుద్యోగ యువతి, యువకులు గొప్ప సువర్ణ అవకాశం రాష్ట్ర ప్రభుత్వం వారు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి కోదాడలో మెగాజాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సైబర్ మోసాలు, ఎక్కడో సుదూర ప్రాంతంలో ఉన్న సైబర్ మెసగాడు ప్రజల అత్యశను అవగాహన లోపాన్ని ఆసరాగా చేసుకుని మన చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌ను ఆయుధంగా చేసుకుని మెసేజ్‌ల రూపంలో ఫోన్‌కాల్స్ రూపంలో మన సమచారాన్ని దొంగిలించి డబ్బు దోచేస్తూ ఆర్థిక నష్టాన్ని కలిగిస్తున్నారు. మన సమాజాన్ని మన యువతను, పిల్లలను ఆరోగ్యాలను పట్టి పీడిస్తున్న డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి సేవించేవారి వివరాలను పోలీస్ 112కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపతి లలిత, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, మాజీ సర్పంచ్ కోటేశ్వర రావు, పోలీస్ కళాబృందం పాల్గొన్నారు.

## నూతన గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని వల్లాపురం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనం, మహిళ సమాఖ్య భవనాల నిర్మాణానికి శుక్రవారం ఎంపిడివో మల్సూర్‌నాయక్ సర్పంచ్ కేసగాని సరితతో కలిసి శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పనుల కింద 30 లక్షల రూపాయలతో ఈ భవనాలను నిర్మించనున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భవనాలు నిర్మాణం పూర్తయితే ప్రజలకు పరిపాలన సేవలు అందుబాటులో ఉంటాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడానికి సమావేశాలు నిర్వహణకు విలవుతుందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండటానికి ఈ భవనాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ భవనాల నిర్మాణాలను కాంట్రాక్టర్ త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఎఈ లావణ్య, పంచాయతీ కార్యదర్శి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ కోట చంద్రశేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు, మహిళ సమాఖ్య సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి, నిండుచర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయాన్ని అందిపుచ్చుకుంటున్న రైతులు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** రైతులు ఆధునిక వ్యవసాయాన్ని అందిపుచ్చుకుంటూ పంటదిగుబడిలో కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. పోచంపల్లి పురపాలిక కేంద్రంలోని ఏనుగువారి గూడెంలో ఒక పెద్ద రైతు ఏనుగు కిషన్ రెడ్డి తన పొలంలో వరిపంటకు అకస్మాత్తుగా సోకే దోమకాటు నివారణకు వాడే రసాయనాన్ని డ్రోన్ ద్వార వరిచేలుపై పిచికారి చేస్తున్న దృశ్యం శుక్రవారం ప్రజాపక్షం కెమెరా కంట పడింది.మెరుగైన నాణ్యమైన పంట దిగుబడి కోసం కొత్తగా వస్తున్న అధునాతన సాంకేతిక పరికరాలను ఉపయోగిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా నడిపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.ఒకప్పుడు అధ్యయన పరిశోధన కేంద్రాలకే పరిమితమైన టెక్నాలజి అన్ని మారుమూల గ్రామాలకు విస్తరిస్తుంది.మారుతున్న కాలానికి తగ్గట్టుగా రైతులు అడ్వాన్స్ టెక్నాలజీని వాడుతుండడం గమనార్హం.వ్యవసాయ అధికారులు అన్ని రకాల రైతులకు ఎప్పటికప్పుడు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తూ చైతన్య పరుస్తున్నారని చెప్పాటనికి ఇదొక నిదర్శనం.శాస్త్రవేత్తల కృషి ఫలాలు రైతుల శ్రమను తగ్గించి కొత్త బాటలు వేయటం వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులకు ఇలాంటివెన్నో కళ్ళ ముందు ఆవిష్కృతం అవుతున్నాయి.కాలానికి అనుగుణంగా పంటమార్పిడి విధానం, టెక్నాలజితో రైతులకు వ్యవసాయం మరింత లాభసాటిగా మారుతుందని చెప్పే ప్రభుత్వ సూచనలను తప్పక పాటిస్తే పంట దిగుబడి నష్టం ఉండదనీ మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయి. కాగా ఆ రైతు డ్రోన్లతో సమయం ఆదా చేయచేయటమే కాక పెస్టిసైడ్ ల బారిన పడకుండా రైతుల ఆరోగ్యం బాగుంటుదన్నారు. మూసి బెల్టు పరివాహక ప్రాంత రైతులకు అకస్మాత్తు దోమకాటు రోగంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన చెందారు. దోమకాటు నివారణ రసాయనాన్ని వాడినా వరి ఎండిపోయిందని వాపొయ్యారు.అధికారులు రైతులకు తగు సూచనలు చేయాలని కోరారు.



## ప్రజావాణి అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన డిఎల్‌పిఒ

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని చిట్టంపహాడ్ గ్రామంలో ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులపై శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి శంకర్ నాయక్ క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. గ్రామ కంఠం భూమి, డివిజనల్ రిజిస్టర్లో గ్రామ కంఠం మార్పులు, చేర్పులు, ఇఒ బిల్డింగ్,పారిశుధ్య నిర్వహణపై వచ్చిన ఫిర్యాదులపై ఆయన నేరుగా గ్రామానికి చేరుకుని స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు.ఈ సందర్భంగా డిఎల్‌పిఓ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి అర్జీకి ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని పంచాయతీ కార్యదర్శి, సిబ్బందిని హెచ్చరించారు. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరే దేవేంద్ర సైదులు,ఉప సర్పంచ్ అమరవాది యాదయ్య,పంచాయతీ కార్యదర్శి వెంకటేశం,పాలకవర్గ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థినికి ప్రభుత్వ కాలేజీలో మెడికల్ సీటు



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మండలంలోని మంచ్యతండ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని భూక్య కావేరి నీట్‌లో ఘన విజయం సాధించింది. నీట్ పరీక్షలో 450 మార్కులు సాధించి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఖమ్మంలో సీటు సాధించింది. అడవి బిడ్డ అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించింది. సదుపాయాలు లేని చోట పుట్టినా సరైన సదుపాయం లేని బడిలో చదివినా పట్టుదలే పెట్టుబడిగా, కష్టాన్ని ఆయుధంగా మలచి వైద్య విద్యలో సీటు సాధించి అందరికి ఆదర్శంగా నిలిచింది. పేదరికం నా చదువును ఆపగలదేమో గానీ నా ఆశయాన్ని కాదు అని నిరూపించింది కావేరి. మా తండలో సరైన వైద్యం అందక ఇబ్బందిపడే ప్రతి ఒక్కరి కళ్ళలోని బాధ నన్ను డాక్టర్‌ను చేయాలనుకునేలా ప్రేరేపించింది అన్నారు. చిన్ననాటి నుండే వైద్యురాలు కావాలనే లక్ష్యంతో పట్టుదలతో చదివిన ఆమెకు తల్లిదండ్రులు భూక్య కిషన్ సరిత, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోడైంది. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలు, గిరిజనులు గ్రామీణ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని తెలిపింది. ఆమె విజయంపై గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## సాంకేతిక లోపాలకు మరమ్మతులు చేయాలి

**ప్రజాపక్షం/చింతలపాలెం :** రైతులు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని, సాగునీరు అందించడంలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని హుజూర్‌నగర్ నియోజక వర్గ బిఆర్ఎస్ నాయకుడు పిల్లుట్ల రఘు అన్నారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్ నియోజక వర్గంలోనే రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని శివగంగ ఎత్తిపోతల పథకం వద్ద వెంకట్ గౌడ్, రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివగంగ ఎత్తిపోతల పథకం ద్వారా సుమారు 13 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికి లిఫ్ట్ సక్రమంగా పనిచేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి పోల్నేడి శ్రీనివాస్, హుజూర్‌నగర్ బిఆర్ఎస్ నాయకులు నగేష్ రాథోడ్, షేక్ మైబెల్లి, యారబోలు ముక్కంటి రెడ్డి పాల్గొన్నారు.



## ఆంక్షలు లేకుండా రైతు బీమా వర్తింపజేయాలి

**ప్రజాపక్షం/డిండి**; అర్హత ఉండి రైతు ఎలాంటి కారణం చేతనైనా ప్రమాదవశాత్తు చనిపోయిన రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయశాఖ ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు బీమాను అందించి ఆ కుటుంబానికి భరోసా కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దిన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమా విషయంలో ఆగస్టు 14లోపు చనిపోయిన రైతులకు మాత్రమే అన్‌లైన్‌నమోదుకు, బీమా క్లైమ్ చేయుటకు సంబంధిత రైతులు ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు అవుతాయని ఆగస్టు 14 తర్వాత చనిపోయిన రైతుల వివరాలు మాత్రమే వ్యవసాయ అధికారులు నమోదు చేసేలా నిబంధనలు ప్రస్తుతం ఉన్నాయని ఆ రైతులకు రైతు బీమా చేయుటకు ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అనుమతి ఇవ్వకపోవడంతో అధికారులు బీమా క్లైమ్ చేయలేక పోతున్నారని ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతుకు రైతు బీమా అర్హత ఉండి చనిపోయిన ప్రతి రైతుకు రైతు బీమా వర్తింపజేయాలని మైనోద్దిన్ రైతు సంఘం పక్షాన బుధవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నూకల జానకి మృతి అత్యంత బాధాకరం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్**: తెలంగాణ ఉద్యమ మహిళ సంఘం హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షురాలు, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు నూకల జానకి మృతి చెందడం అత్యంత బాధాకరమని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు సతీమణి జానకి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నరేందర్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్‌రావు, గెల్లి రవి, కోల నాగేశ్వరరావు, రాజా రమేష్, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎల్‌ఓసి చెక్కు అందజేత

**ప్రజాపక్షం/చౌటుప్పల్** : చౌటుప్పల్ మునిసిపాలిటీ 18వ వార్డు కు చెందిన పి.ఓంప్రకాష్ కిడ్ని వ్యాధితో గత కొంతకాలంగా బాధపడుతున్నాడు.అత్యవసర డయాలసిస్ ఖర్చు కోసం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సిఫార్సు మేరకు మంజూరైన ఎల్‌ఓసి రూ.లక్ష చెక్కును శుక్రవారం లబ్దిదారుకు మునిసిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్‌కుమార్ అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మునిసిపాలిటీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి,నాయకులు కాంశెట్టి భాస్కర్,గుగులోతు శంకర్ తదితరులు పాల్గోన్నారు.



## ఎఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/దేవరకొండ;** దేశ స్వాతంత్రోద్యమంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో మరియు మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించిన ఏకైక జాతీయ విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్)అని. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవ మహాసభలను సెప్టెంబర్ 28, 29, 30 తేదిల్లో హన్మకొండ జిల్లా వేదికగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని వివిధ కళాశాలలో వార్షికోత్సవాల గోడ పత్రికలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వట్టేపు శివకుమార్ మాట్లాడుతూ చదువు పోరాటం చదువు పోరాడు అనే నినాదంతో విద్యార్థి లోకం పక్షాన నిలబడి పోరాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ 90ఏళ్ల ఘనమైన చరిత్రను పూర్తి చేసుకుంటోంది. సెప్టెంబర్ 28,29,30 తేదిలలో హన్మకొండ వేదికగా జరిగే ఈ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారని, పేద వాడు చదువుకోవాలంటే లక్షల రూపాయాలు వెచ్చించాల్సిన పిరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శంశోద్దిన్, మండల కార్యదర్శి హన్మంత్, రాంచరణ్, శివ, అజయ్, ప్రణీత్, శంకర్, అనిల్, శివలీలా, అంజలి, లక్ష్మీ , మాధవి, అరుణ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## జిఒ నెం.97ను వెంటనే రద్దు చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్**: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ప్రతిపాదిత శక్తి డిపార్ట్‌మెంట్‌లో విలీనం చేసే జీవో నెం.97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. నల్లగొండ పాలిటెక్నిక్ స్టూడెంట్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఐటీ టవర్ సమీపంలోని ప్రధాన రహదారిపై విద్యార్థులు పెద్ద సంఖ్యలో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేయడం వల్ల విద్యార్థుల విద్యా భవిష్యత్‌పై ప్రభావం పడే అవకాశం ఉందని, సాంకేతిక విద్యను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని విద్యార్థులు నినాదాలు చేశారు. జీవో 97ను వెంటనే రద్దు చేసి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యథావిధిగా కొనసాగించాలని, విద్యార్థులు, సిబ్బంది ప్రయోజనాలను పరిరక్షించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల రాస్తారోకో కారణంగా నల్లగొండ పట్టణంలోకి వెళ్లే ప్రధాన రహదారిపై దాదాపు గంటపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేసి వారిని అక్కడి నుంచి పంపించారు. జీవో 97 రద్దు చేసే వరకు తమ ఆందోళనలను కొనసాగిస్తామని స్టూడెంట్ జేఏసీ నాయకులు తెలిపారు.

## అధిక నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి రెండు వేల కోట్ల రూపాయలు మంజూరు చేయించాడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జక్కలి ఐలయ్య యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రోడ్ల అభివృద్ధి కోసం పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి హ్యామ్ పథకాల ద్వారా వెయ్యి కోట్లకు పైగా మంజూరు అయ్యాయని తెలిపారు. పంచాయతీరాజ్ రోడ్లను ఆర్ అండ్ బి రోడ్లుగా మార్చి డబల్ రోడ్డుగా వేయడం. పంచాయతీ రాజ్ రోడ్డు 12 ఫీట్ల ఉండే దాన్ని 18 ఫీట్లుగా వేస్తు పెద్ద ఎత్తున విధులు మంజూరు చేశారని చెప్పారు. విద్యుత్ సబ్ స్టేషన్లు హెల్త్ సబ్ సెంటర్స్, ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలకు పట్టుబట్టి కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు మందుగుల బాలకృష్ణ, కుక్కల నరసింహ, సర్పంచ్‌లు జరుపుల జగన్, కరెంటు లక్ష్మీ శ్రీరామ్ నాయక్, తోటకూరి శంకర్, లోడ్ రఘు, నాయకులు కురిమిద్దే గోపాల్, బద్ధుల యాదగిరి, జేరుపుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌జి కళాశాలలో కెరీర్ రెడీనెస్ సన్నద్ధత

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** విద్యార్థినులు విద్యతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ సూచించారు.శుక్రవారం కళాశాలలో మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో లాంచ్ గర్ల్స్ సంస్థ నిర్వహిస్తున్న కెరీర్ సన్నద్ధత కార్యక్రమంపై మొదటి సంవత్సరం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల దశనుంచే భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టత ఏర్పరచుకుని,అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.మహిళా సాధికారత సెల్ ఇన్‌చార్జి వి.శిరీష మాట్లాడుతూ విద్యార్థినులు తమలోని సామర్థ్యాలను గుర్తించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నూతన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు.లాంచ్ గర్ల్స్ కార్యక్రమ సహాయకురాలు దివ్య మాట్లాడుతూ వాస్తవ జీవిత పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసం, సంభాషణా నైపుణ్యాలు,వ్యూహాత్మక ఆలోచన,ప్రణాళిక,నిర్ణయాలు తీసుకునే సామర్థం,ఆర్థిక నిర్వహణ,భవిష్యత్ సన్నద్ధత వంటి అంశాలను ఈ కార్యక్రమం ద్వారా అభివృద్ధి చేసుకోవచ్చని వివరించారు.కార్యక్రమంలో అధ్యాపకులు కె.శివరాణి,డాక్టర్ వెల్దండి శ్రీధర్,ఎన్. కోటయ్య,సావిత్రి, మహేశ్వరి,స్రవంతి, సంధ్య,హస్రత్, నస్రీన్,కవిత, శ్వేత పాల్గొన్నారు.



## పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

**ప్రజాపక్షం/యాదాద్రి** : 22వ వార్డులోని ఇందిరానగర్ కమ్యూనిటీ హాలులో 2 లక్షల రూపాయలతో చేపట్టిన నూతన వాటర్ ట్యంకు మరియు కమ్యూనిటీ హాలు రిపేర్ల పనులను మునిసిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో మన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగున్నాయని, అలాగే ఈ పనులతో 22వ వార్డు నీటి సమస్య రహిత వార్డుగా మారబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ జాలిగం విగ్నేష్, పిసిసి డెలిగేట్ తంగళ్ళపల్లి రవి కుమార్, నాయకులు చల్ల కిషోర్, బుషపక మనీష్, ఇటుకల దేవేందర్, రాకేష్, ఉమా మహేష్, చక్రపాణి పాల్గొన్నారు.

## పిల్లాయిపల్లి కాలువలో గుర్రపు డెక్కకు తొలగింపు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి కాలువలో గుర్రపు డెక్కాకు తొలగింపు పూడికతీత కార్యక్రమం చేపట్టినట్లు పోచంపల్లి మండల కాంగ్రేస్ పార్టి అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ తెలిపారు.సుమారు 48కి.మి మేర కాలువలో పేరుకు పోయిన గుర్రపు డెక్కాకు తొలగింపు పూడికతీత పనులు శుక్ర వారం మునుగోడు, భువనగిరి ఎమ్మెల్యేలు రాజగోపాల్ రెడ్డి కుంభం అనిల్ కుమార్ రెడ్డిల సహకారంతో సిఎస్ఆర్ నిధులు,చౌటుప్పల్ దివీస్ ల్యాబ్స్ ఆర్థిక సహకారంతో ప్రారంభించినట్లు తెలిపారు.పిల్లాయిపల్లి నుండి పెద్దకాపర్తి వరకు ఉండే ఈ కాలువ పనులను నెల రోజుల్లో పూర్తి చేయనున్నట్లు చెప్పారు.రూ.20లక్షలతో జరిగే పనులతో ముప్పై వేల ఎకరాలకు సాగు అందుతుందని వివరించారు.రైతులకు వ్యవసాయాన్ని పంట దిగుబడిలో లాభాలు సాధించేందుకు నీటిపారుదల శాఖ శ్రీకారం చుట్టిందని అన్నారు.

## రైతులు డిజిటల్ పంట నమోదు

**ప్రజాపక్షం/బొమ్మలరామారం** : రైతులు డీసీఎస్ (డిజిటల్ పంట నమోదు) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి దుర్గేశ్వరి అన్నారు మండలంలోని రైతులు తమ పంటల వివరాలను డిజిటల్ పంట నమోదు కార్యక్రమంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆమె శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలిపారు. సెప్టెంబర్ 30, 2026లోపు పంటల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. పంట నమోదు కార్యక్రమం ఏమైనా సందేహాలు లేదా ఫిర్యాదులు ఉంటే 72 గంటల లోపు సంబంధిత ఏఈఓని కలిసి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సీమ, వాలంటీర్ నాగులు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

## చట్టాలపై అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/చండూరు:**విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు పిలుపునిచ్చారు.శుక్రవారం చండూరు మున్సిపల్ కేంద్రంలోని గాంధీజీ విద్యాసంస్థలలో నల్లగొండ భరోసా సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహిళలు,పిల్లలపై జరిగే వేధింపుల నివారణకు భరోసా సెంటర్లు పనిచేస్తున్నాయని,ఆన్‌లైన్ మోసాలు,సైబర్ క్రైమ్ పట్ల ప్రతి విద్యార్థి అప్రమత్తంగా ఉండాలన్నారు. గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న,ప్రిన్సిపాల్ జాని,పులిపాటి రాధిక,భరోసా మెడికల్ ఆఫీసర్ నిరోష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దానం నాగేందర్‌పై అనర్హత వేటు...

**ప్రజాపక్షం/దేవరకొండ;** ఖైరతాబాద్ ఎంఎల్‌ఏ దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయడం బిఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన న్యాయ పోరాటానికి ఫలితమని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. పార్టీ ఫిరాయింపులపై రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికి వాటిని పట్టించుకోకుండా వ్యవహరించిన వారికి ఈ తీర్పు ఒక గుణపాఠం అని ఆయన అన్నారు. బిఆర్‌ఎస్ తరుపున గెలిచి, కాంగ్రెస్ పార్టీ తరుపున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయని, స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బిఆరెఎస్ ఎంఎల్‌ఏ పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. తెలంగాణ హైకోర్టు శుక్రవారం దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ తీర్పు ఇవ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి ప్రజాస్వామ్య విలువలకు బలం చేకూర్చిందని రవీంద్రకుమార్ అన్నారు.

## పల్లా సుధీర్‌రెడ్డికి నివాళులు



**ప్రజాపక్షం/డిండి;** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ పల్లా నర్సింహారెడ్డి కుమారుడు అమరజీవి కామ్రేడ్ పల్లా సుధీర్‌రెడ్డి సంస్మరణ సభలో శుక్రవారం పాల్గొన్న సిపిఐ డిండి మండల నాయకులు మండల కమ్యూనిస్టు పార్టీ పక్షాన సుధీర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారిలో సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, సహాయ కార్యదర్శి విజేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, నాయకులు జమిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌ఐ,పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలంగాణ పోలీస్ శాఖలో త్వరలో నిర్వహించనున్న ఎస్‌ఐ, కానిస్టేబుల్ నియామకాలకు పోటీపడుతున్న నిరుద్యోగ యువతకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన 500 మంది యువతీ,యువకులను ఎంపిక చేసి నల్గొండ పోలీస్ ట్రైనింగ్ సెంటర్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలనుకునే అభ్యర్థులు గూగుల్ ఫామ్ లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

## పటిష్టంగా ఉండాలి

**ప్రజాపక్షం/వేములపల్లి:** గణేష్ శోభాయాత్ర,నిమజ్జన ఏర్పాట్లలో పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఓ రమణారెడ్డి సూచించారు. శుక్రవారం మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ శ్రీజా రెడ్డితో కలిసి నాగార్జునసాగర్ ఎడమ కాలువను పరిశీలించారు.నిమజ్జన కార్యక్రమంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఆయన వెంట ఎంపీడీవో జ్యోతి,డిప్యూటీ తహసీల్దార్ కోటేశ్వరి, ఎస్‌హెచ్‌ఓ డి.వెంకటేశ్వర్లు ఉన్నారు.



## విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:**విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించి విశ్వవిద్యాలయానికి, రాష్ట్రానికి జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఆకాంక్షించారు.ఎంజియూలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు నిర్వహిస్తున్న అంతర కళాశాల కబడ్డీ పోటీలు శుక్రవారం రెండో రోజు హోరాహోరీగా కొనసాగాయి.ఫైనల్ పోటీల్లో బాలుర విభాగంలో కెఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోదాడ విద్యార్థులు ప్రథమ స్థానంలో, నల్లగొండ నాగార్జున కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు.బాలికల విభాగంలో సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల చర్లపల్లి ( నల్లగొండ) విద్యార్థినులు ప్రథమ స్థానంలో, ఎస్‌ఎల్‌ఎన్ఎస్ డిగ్రీ కాలేజీ భువనగిరి విద్యార్థినులు ద్వితీయ స్థానంలో నిలిచారు.గెలుపొందిన విద్యార్థులకు వీసీ అల్తాఫ్ హుస్సేన్ బహుమతులు ప్రదానం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా, శారీరకంగా బలంగా ఉండేందుకు విశ్వవిద్యాలయం విద్యతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యత ఇస్తోందన్నారు.కార్యక్రమంలో యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ రమావత్ మురళి,డాక్టర్ వై.శ్రీనివాస్ రెడ్డి,స్పోర్ట్స్ బోర్డ్ డైరెక్టర్ డాక్టర్ మద్దిలేటి పసుపుల, వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## దివిస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** దివిస్ పరిశ్రమ యాజమాన్యం ఆధ్వర్యంలో మండలంలోని చిన్నకొండూర్, మందోళ్ళగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి,అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.అదేవిధంగా రూ.1,77,900 విలువైన నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్‌లు తీగుళ్ళ చంద్రయ్య,టి.వెంకటేశం లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డం సత్యనారయణ, వార్డు సభ్యులు భవాణి,పాఠశాల చైర్మన్ తీగుళ్ళ రమణ, సంతోష, ప్రధానోపాధ్యాయులు గంగాపురం రవికరణ్,రమాదేవి,వరలక్ష్మి ,సంధ్య,దివిస్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు,శివకృష్ణ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నందికొండలో విద్యుత్ కష్టాలు



**ప్రజాపక్షం/నందికొండ:** స్థానిక నందికొండ మున్సిపాలిటీలో విద్యుత్ సరఫరా పరిస్థితి రోజురోజుకూ దారుణంగా మారుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ సరఫరాలో తరచూ హెచ్చుతగ్గులు, అంతరాయాల కారణంగా నీటిని పంపింగ్ చేసే మోటార్లు తరచుగా కాలిపోతున్నాయని ప్రజలు చెబుతున్నారు.దీంతో ఒకవైపు విద్యుత్ సమస్య మరోవైపు తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజల కష్టాలు రెట్టింపవుతున్నాయి.మోటార్లు మరమ్మతులకు గురికావడం, నీటి పంపింగ్ నిలిచిపోవడంతో కాలనిలో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతుంటే.. దోమలకు మాత్రం ఇదే అదనుగా మారింది. పారిశుధ్య సమస్యలు, నిలిచిపోయే నీరు, రాత్రివేళల్లో విద్యుత్ లేకపోవడంతో దోమల బెడద మరింత పెరుగుతోందని స్థానికులు వాపోతున్నారు. దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులపై ఆందోళన నెలకొంది.ప్రజలకు అత్యవసరమైన విద్యుత్, తాగునీటి సరఫరా రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాలనీవాసుల ఇబ్బందులను గుర్తించి విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, నీటి సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేసి, దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నందికొండ ప్రజలు కోరుతున్నారు.

## కంపెనీ అనుమతులను రద్దు చేయాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం ఆరెగూడెం గ్రామ పరిధిలో నూతనంగా నిర్మాణం చేస్తున్న జెన్‌టెక్ క్రాఫ్ మరియు అభయ క్రాప్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు గ్రామపంచాయతీ ఇచ్చిన ఎన్‌ఓసిలను రద్దు చేయాలని గ్రామ బిజెపి నాయకులు శుక్రవారం పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు.గ్రామ పరిధిలో కెమికల్ కంపెనీలకు అనుమతులు ఇవ్వవద్దని గతంలోనే గ్రామసభల్లో తీర్మాణం చేసిన కూడా ప్రస్తుతం ఎన్‌ఓసి ఇవ్వడం ఎంటని ప్రశ్నించారు.ప్రస్తుతం ఇచ్చిన ఎన్‌ఓసిలను రద్దు చేయాలని,తిరిగి గ్రామసభ నిర్వహించి ప్రజల నుండి అభిప్రాయసేకరణ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మునుగాల మహిపాల్ రెడ్డి,వార్డు సభ్యులు మునుగాల అమరేందర్‌రెడ్డి,నాయకులు ఎన్నపల్లి శ్రీకాంత్‌రెడ్డి,మునుగాల రాజశేఖర్‌రెడ్డి, గంగనబోయిన శేఖర్,కందుల శ్రీశైలం,మన్నే మహేందర్ రెడ్డి,బద్దం శ్రీకాంత్,ఎన్నపల్లి మహేందర్‌రెడ్డి,సాదోజు శివ చారి,మన్నే జంగారెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## పోషణ్ అభియాన్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మండలంలోని బుద్ధారం గ్రామంలోని పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ సెంటర్‌లో శుక్రవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.పిల్లలు,గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారం ప్రాముఖ్యత,సమతుల ఆహారం పరిశుభ్రత, రక్తహీనత నివారణపై అంగన్వాడీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సూపర్‌వైజర్, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్లు, గ్రామ మహిళలు, తల్లులు, ప్రజలు పాల్గొన్నారు.



## ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** భార్య మరణంతో ఒంటరి జివితంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతు ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చౌటుప్పల్ మునిసిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తంగడిపల్లి గ్రామానికి చెందిన బుంగపట్ల మహేష్(33) భార్య స్వప్న గత 16 నెలల క్రితం కుటుంబ కలహాలతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది.వీరికి కూతురు,కోడుకు ఉన్నారు.పిల్లలిద్దరూ అమ్మమ్మ వాళ్ళ ఇంటివద్ద ఉంటున్నారు.డ్రైవర్‌గా పని చేస్తున్న మహేష్ గత కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందుల పడుతున్నాడు.దీనికి తోడు భార్య మరణంతో ఒంటరిగా జివితం సాగిస్తు మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు.ఈక్రమంలో శుక్రవారం ఉదయం అతని ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.తల్లిదండ్రులు ఇద్దరు ఆత్మహత్య చేసుకోవడంతో ఇద్దరూ చిన్నారులు అనాథలైయ్యారు.మృతుడి అన్న బుంగపట్ల మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ మన్మథకుమార్ తెలిపారు.

## చలో ఢిల్లీ జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/వేములపల్లి :** కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 1,2,3 తేదీల్లో జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి సలీం పిలుపునిచ్చారు.మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కేంద్రం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకురావడాన్ని నిరసిస్తూ,కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు కల్పించి పర్మినెంట్ చేయాలనే డిమాండ్లతో చేపడుతున్న పోరాటాన్ని విజయవంతం చేయాలన్నారు. సీపీఎం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రొండి శ్రీనివాస్‌ను సీఐటీయూ మండల నూతన కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికారు మల్లేష్,జిల్లా ఉపాధ్యక్షులు మల్లు గౌతంరెడ్డి,రవి నాయక్, రైతు సంఘం జిల్లా నాయకుడు పాల్వాయి రామిరెడ్డి,పుట్టల రాధిక,విగ్నేశ్వరి,దేవకమ్మ,పాక పిచ్చయ్య,ఈశ్వరం శ్రీనివాస్,వెలుగుపల్లి నరసయ్య, మాతంగి రీగన్,శాంతి,లక్ష్మి,యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** చిన్నారుల పెంపకంలో, వారి సమగ్ర పోషణలో తండ్రులు, పురుష సంరక్షకులు చురుగ్గా భాగస్వాములు కావాలని అంగన్వాడీ సూపర్వైజర్ సిహెచ్.పద్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఐసీడీఎస్ మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని చిల్లాపురం సెక్టార్ కుర్యాతండా, సీతారాంపురం సెక్టార్ సిపిఎం ఆఫీస్ బ్యాక్2 అంగన్వాడీ కేంద్రాల్లో సీడీపీఓ పి. వేణుగోపాల్ రావు ఆదేశాల మేరకు ‘మన అంగన్వాడీ మన బాధ్యత’ అనే థీమ్‌తో పోషణ మాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లో వివిధ రకాల పౌష్టికాహార ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ సైదులు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వార్డు కౌన్సిలర్ షబానా అయూబ్, అంగన్వాడీ టీచర్లు నీలావతి, షాహిన్, మెహరా సుల్తానా, హెల్పర్లు హచ్చి, జగదీశ్వరి, రాధాబాయి, సైదమ్మ, ఆశా కార్యకర్త ధనలక్ష్మి , గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, తల్లులు, పసిపిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన వితరణ

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలం మొల్కపట్నం గ్రామంలో విగ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో అన్నవితరణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రెగ్గట్టి రవీందర్ రెడ్డి,సర్పంచ్ జేరిపోతుల మౌనిక సురేందర్ తో కలిసి పాల్గొన్నారు.మొదటగా పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నదానంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాలను స్వయంగా అందజేశారు.





## హెచ్ఐవిపై అవగాహన

**ప్రజాపక్షం/రామన్నపేట :** మండల కేంద్రంలో శ్రీ సాయి ఆరట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం కళాజాత ప్రోగ్రామ్ ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హెచ్ఐవి అనేది కేవలం ఒక వ్యాధి కాదని, మన అజాగ్రత్త వల్ల సోకే సమస్య అని తెలిపారు. హెచ్ఐవి సోకిన వారితో కలిసి మెలిసి ఉండవచ్చని, కరచాలనం వల్ల ఈ వైరస్ వ్యాపించదని స్పష్టం చేశారు. బాధితులను చిన్న చూపు చూడకుండా మానవతా దృక్పథంతో ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రామన్నపేట ఐసీటీసీ కౌన్సిలర్ పెరిక సైదులు,రామన్నపేట క్లస్టర్ లింక్ వర్కర్ మేడి ముకుంద,వార్డు మెంబర్లు శేఖర్,కారోబార్ నకిరేకంటి రాము,గౌరిగే సోములు,బాలరాజు పాల్గొన్నారు.

## నాగరాజు మృతిపట్ల సంతాపం



**ప్రజాపక్షం/రామన్నపేట :** పట్టణ కేంద్రానికి చెందిన గొర్ల నాగరాజు ఆకస్మిక మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ యువనేత వేముల విపుల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన రామన్నపేటలోని నాగరాజు నివాసానికి వెళ్లి, వారి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ,కుటుంబానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో తన వంతు సహాయంగా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జమీరుద్దీన్, ఉపసర్పంచ్ మోటే రమేష్, ఎం.డి అక్రమ్,గోదాసు పృథ్వీరాజ్,కోట సుధాకర్,ఎండి అంజాద్, కొమ్ము శేఖర్, ఏటెల్లి పరమేష్ పాల్గొన్నారు.

## మృతదేహానికి నివాళులు



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండలం మునిపంపుల గ్రామానికి చెందిన ఉడతల శ్రీను తల్లి సుక్కమ్మ అనారోగ్యంతో మరణించగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోష బోయిన మల్లేశం, పల్లివాడ ఇంద్రపాలనగరం సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్పాల్గొన్నారు.

## రాష్ట్రపతి అవార్డు గ్రహీతకు సన్మానం

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** రాష్ట్రపతి నుండి జాతీయ స్థాయిలో అవార్డు పొందిన చౌటుప్పల్ పట్టణానికి చెందిన గంజి వెంకటేష్ను స్థానిక బిజెపి నాయకులు సన్మానించారు. ప్రధాని నరేంద్రమోడీ జన్మదిన సేవ సంకల్ప ఉత్సవంలో భాగంగా సన్మానం చేసినట్లు బిజెపి అధ్యక్షురాలు కడారి కల్పన తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రమనగోని శంకర్,పోలోజు శ్రీధర్బాబు,కంచర్ల గోవర్ధన్రెడ్డి,కడారి అయిలయ్య,కాసుల వెంకటేశం,కృష్ణ,శ్రీనివాస్రెడ్డి,ధనంజయ్య,పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



# అన్నప్రసాద వితరణ కార్యక్రమం





**ప్రజాపక్షం/తుర్కపల్లి :** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కన శ్రీ రుద్ర సేన యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుని మండపం వద్ద ఉపసర్పంచ్ పల్లె నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోమల వెంకటేష్, పురోహితుడు రమాకాంత్ శర్మ, బండారి శ్రీను, రొయ్యల మధు, పాముల బాలకృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/త్రిపురారం :** మండల కేంద్రంలోని శాంతినగర్ 2వ వార్డులో కొలువుదీరిన గణనాథుని వద్ద శుక్రవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.శాంతినగర్ వాస్తవ్యులు మెరుగు రాములు,పద్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి,ఉప సర్పంచ్ అనుముల నాగమణి, 1వ వార్డు మెంబర్ చింతకాయల యాదయ్య,2వ వార్డు మెంబర్ రావుల పార్వతమ్మ, కాంగ్రెస్ నాయకులు మజ్జిగపు శ్రీనివాస్ రెడ్డి, అనుముల నిఖిల్ రెడ్డి, బీజేపీ నాయకులు రెమడాల రమేష్,జానకిరామ్ రెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణం లోని శ్రీనగర్ కాలనీలోని వినాయక మండపం వ ద్ద వినాయక పూజా కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు,కమిటీ సభ్యులు మద్ది వెంకటరమణారెడ్డి,మిరియాల స్వామి,గూడూరు ఉమారెడ్డి,గాదే అశోక్రెడ్డి,శ్రీనివాసరాజు,కోటేశ్వరరావు పాల్గొన్నారు.




# అంబేద్కర్ను కల్పిత నాయకుడనడం దుష్ప్రచారం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ను కల్పిత నాయకుడంటూ ఆర్ఎస్ఎస్ ముసుగులో సాగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున అన్నారు.జిల్లా కేంద్రంలోని డిఈఓ కార్యాలయం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కెవిపిఎస్,మాల మహానాడు,వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ.. అంబేద్కర్ను కల్పిత నాయకుడంటూ పుస్తకం విడుదల చేస్తానని ప్రచారం చేస్తున్న పంది ప్రసాద్పై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు అద్దంకి రవీందర్,తెలగమల్ల యాదగిరి,ఏనుముల అనిల్,గాదె నరసింహ,బొల్లు రవీంద్రకుమార్, కొండా వెంకన్న,పోలే సత్యనారాయణ,చందా యాదగిరి,శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉత్తటూర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్



**ప్రజాపక్షం/రామన్నపేట :** మండల పరిధిలోని ఉత్తటూర్ గ్రామంలో గల ఎస్సీ కమ్యూనిటీ హాల్ పూర్తిగా అధ్వానంగా మారి,నిరుపయోగంగా తయారైందని బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు మేడి రాజు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని అణగారిన వర్గాల సంక్షేమం, సమావేశాలు, సామాజిక కార్యక్రమాల కోసం నిర్మించిన ఈ భవనం నిర్వహణ లేక శిథిలావస్థకు చేరడం పట్ల ఆయన ఆందోళన వెలిబుచ్చారు. 2018 సంవత్సరంలోనే స్థానిక ఎమ్మెల్యేకు ఈ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కోసం వినతిపత్రం అందజేసినట్లు గుర్తు చేశారు.వినతిపత్రం సమర్పించి సంవత్సరాలు గడుస్తున్నా, అధికారుల నుండి గానీ, ప్రజాప్రతినిధుల నుండి గానీ ఎలాంటి సానుకూల స్పందన లేదని ఆయన విమర్శించారు. మౌలిక వసతులు కరవు కావడంతో, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడకుండా పోయిందని వాపోయారు. శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ హాల్కు వెంటనే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని,భవనంలో తాగునీరు,విద్యుత్,ఇతర అవసరమైన వసతులను కల్పించాలని,గ్రామంలోని ఎస్సీ కుటుంబాలు,యువకులు, మహిళలు నిర్వహించుకునే శుభకార్యాలు,వివిధ సామాజిక కార్యక్రమాలకు ఈ భవనం అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని,ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి,ఎస్సీ కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

## జిల్లా అధ్యక్షుడిగా గొలనుకొండ వివేక్

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండల కేంద్రానికి చెందిన గొలనుకొండ వివేక్ హైదరాబాద్ మహాత్మా గాంధీ న్యాయ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వివేక్ను యాదాద్రి భువనగిరి జిల్లా లీగల్ స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షులుగా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కె.బాలు నాయక్ నియమించారు. వివేక్ మాట్లాడుతూ న్యాయ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని జిల్లా అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి కారణం

**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని రావులపెంట గ్రామంలో లంబోదర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవ కమిటీకి బీఎల్ఆర్ కానుక దక్కకపోవడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.రావులపెంటలో మొత్తం 17 విగ్రహాలు ఉండగా 16 విగ్రహాలకు కానుక ఇచ్చి, లంబోదర యూత్ ఏర్పాటు చేసిన ఒక్క విగ్రహానికి మాత్రం ఇవ్వకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమికి లంబోదర యూత్ సభ్యులే కారణమనే అనుమానంతో,కాంగ్రెస్ ఎమ్మెల్యే కాబట్టి సపోర్ట్ చేయలేదనే నెపంతో కానుక ఇవ్వలేదా అనే చర్చ గ్రామంలో జరుగుతోంది. ఎమ్మెల్యే అందజేసే కానుకలు అందరికీ సమానంగా అందకపోవడం సరి కాదని పలువురు ఖండిస్తున్నారు.

## క్రీడాకారులకు అన్నదానం



**ప్రజాపక్షం/మునుగోడు:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు అన్నదానం నిర్వహించారు.ఐదు మండలాలకు చెందిన 350 మంది క్రీడాకారులకు మునుగోడు కాంగ్రెస్ మండల నాయకులు ముచ్చపోతుల శ్రీనివాస్ తన తల్లి దండ్రులు ముచ్చపోతుల మారయ్యరాములమ్మ జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి తలమల్ల మల్లేష్, నియోజకవర్గ క్రీడల కన్వీనర్ పల్లెటి చిన్న జంగయ్య, స్థానిక సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహగౌడ్, మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, వివిధ మండలాల పీఈటీలు, స్థానిక ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలరాజుకు ఎడ్యుకేషన్ యూత్ ఐకాన్ అవార్డు

**ప్రజాపక్షం/డిండి;** నల్గొండ జిల్లా డిండి మండలంలోని కొత్త తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ముద్దాడ బాలరాజుకు సౌత్ ఇండియా ఎడ్యుకేషన్ యూత్ ఐకాన్ అవార్డు లభించింది. మాక్స్ గ్లోబల్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సౌత్ ఇండియా అవార్డు 2026 సీజన్5లో బాలరాజు ఎంపికయ్యారు. తెలుగు రాష్ట్రాల్లోని వేలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు అందుబాటులో ఉంటూ, ఎస్ అండ్ ఎస్ పబ్లికేషన్ వేదికగా యువతకు విద్య, ఉద్యోగాలు సాధించడంలో సేవలందిస్తూ పోటీ పరీక్షలకు కావాల్సిన 15 రకాల పుస్తకాలను ఇప్పటికే బాలరాజు రాశారు. ఇటీవల రాజధాని ఢిల్లీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ విద్యా సదస్సులో పాల్గొన నూతన విద్యా విధానం భవిష్యత్తు ప్రణాళికపై బాలరాజు ప్రసంగించారు. బాలరాజుకు ఎడ్యూకేషన్ యూత్ ఐకాన్ అవార్డు రావడం పట్ల డిండి మండల విద్యాశాఖ తో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు బాలరాజుకు అభినందనలు తెలిపారు.

## రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** జిల్లాలో రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని రైస్మిల్లర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు మంచికంటి భాస్కర్ అన్నారు.చౌటుప్పల్ ఆర్డీఓకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు.మిల్లింగ్ సమయంలో ఏర్పడిన తరుగుల సమస్య బిల్లింగ్ పక్రియలో డ్యామేజ్, నూకలు ఇతర తరుగు 20శాతం వరకు వస్తున్నాయని తెలిపారు.ఈ తరుగును టివి సమయంలో లెక్కలోకి తీసుకోకపోవడం వల్ల రైస్ మిల్లులు నష్టపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైస్ మిల్లు యాజమానులు ఆశోక్,ప్రతినిధులు పాల్గొన్నారు.

